# తమాషా

యం. వినాకి

తాత సావుబతుకుల్లున్నడంటె సూస్తందుకొచ్చినం. కని, పాపం, తాతను అప్పటికె దవకానకు తీస్కపోయింండ్రు.

పొద్దుమీకి నాలుగున్నరకెల్లి ఆరున్నరదాక పోనిస్తరు. అప్పుడు పోదాం, అన్నడు నాయిన.

పెద్దమ్మ మాకు అన్నాలుబెట్టి తినుమన్నది. కని తినబుద్ధికాలేదు. తాత నేను సూడకుంటనే సచ్చిపోతడేమో ననిపిచ్చింది. పెద్దమ్మను సూస్తే మాకు కోపమొచ్చింది. తాత సంగతి యిట్లుంటే, ఆమె తన కొడుకులను, బిడ్డెను బడికి తోలింది. ఏంది, ఈ ఒక్కటి రొండు దినాలు యింట్లుండుమంటే ఏమాయె!

మూడు గంట్లకు పెద్దమ్మ పిల్లగాండ్లు రమేశూ, విద్యానాదూ, చెంద్రికా బడి కెల్లి ఒచ్చిండ్రు. పెద్దమ్మ వాళ్లకు హార్లిక్సు కలిపిచ్చి, మాకు చా చేసి పోశింది.

దవకానకు పొయ్యే టైమయితుంటె, అమ్మ, పెద్దమ్మ మొకాలు కడుక్కొని, సోన్న పెట్టుకొని తయారైండ్రు. ఇంట్ల కట్టుకున్న చీరెలు యిప్పి వేరే మంచి చీరెలు కట్టుకున్నరు. ఇంటి ముందలికి మల్లెపువ్వులమ్మొస్తె ఒక్క చెటాకు పువ్వులు కొనుక్కున్నరు. చెంద్రిక కాటికె పెట్టుకుంటుంటె. "ఏందే చెంద్రికా, పెండ్లికి పోతున్నవా యేం, అంతగనం శోకు చేసుకుంటున్నవు?" అన్నడు పెద్దనాయిన. చెంద్రిక నవ్వింది కని పెద్దమ్మ మొకం మాడ్సుకున్నది.

"అయ్యో. జెర మంచిచీరె కట్టుకోంగనే శోకై పోతది నీకు." అన్నది.

సంచిల పెట్టుకొచ్చుకున్న ఇస్త్రీ అంగీ, పంట్లోను తొడుక్కొని, చెంద్రిక దెగ్గెర పౌడరు అడుక్కొని రాసుకున్న. పెద్దనాయినగూడ బట్టలేస్కున్నంక, రిశాలు పిలిస్తందు కొచ్చినం. ఎవ్వన్ని సూశినా రూపాయికి తక్వ రానంటడు. ఆకరికి బారానకు మాట్లాడి మూడు రిశాలు తీసుకొచ్చినం. ఒక్కదాంట్ల నేను, నాయిన, అమ్మ; ఇంకోదాంట్ల పెద్దమ్మ, యిద్దరు పిల్లగాండ్లు; మూడోదాంట్ల పెద్ద నాయిన, చెంద్రిక.

నాయిన చెప్పింది.

"పెద్దదవకాన శానా పెద్దగుంటది. అక్కడిక్కడ పోయినవంటె అగమై పోతవు. నాచెయ్యి పట్టుకొనుండు. అక్కడంత బీమారి మనుశు లుంటరు. వాల్ల దెగ్గెరికి పొవొద్దు. లొల్లి చెయ్యొద్దు. పెద్దనాయిన పిల్లలంటె యిక్కడుంటోల్లు. వాల్లకన్ని తెలుస్తయి, వాల్లు చేశినట్లల్ల నువ్వు చెయ్యొద్దు."

రిక్ష అఫ్జలుగంజు దెగ్గెర ఆగింది.

'అగో, అదే దవకాన.' అన్నడు నాయిన.

పెద్దనాయిన మూడు రిక్షలకు పైసలిచ్చేశిండు. నేను నాయిన చెయ్యిపట్టుకొని నడిశిన. మంది శానా వొచ్చింద్రు.

నున్నగ బండలు పరిశున్నయి. తెల్లగ గోడలు. నర్సులు బండ్లమీద డబల్‌రొట్టెలు, పాలు పెట్టుకొని తిరుగుతున్నరు. విద్యానాదు ముందుగాల్నె పొయ్యి చెంద్రికను పిలిశిండు.

"అగో, మార్చువరీ."

నాయిన. తాత పక్కనంబరుకోసం సూస్తున్నడు.

"ఏంది అన్నా ?" అన్న పొయ్యి.

"పీన్గల కొట్టిడి." అన్నడు విద్యానాదు.

"అంటె ?"

"సచ్చిపొయినంక మనుశుల్నక్కడ పెడుతరు."

"ఎందుకు ?"

"ఎవరన్నొచ్చి తీస్కపొయిందాక పీన్గ లక్కడే వుంటయి."

"ఇప్పు డక్కడ ఎన్ని పీన్గ లుంటయి అన్నా ?"

విద్యానాదు జెరసేపు ఆలోచించి.

"శానా వుంటయి." అన్నడు.

"ఎన్నో ?"

"వెయ్యి."

"మనల్ని సూడనిస్తరా ?"

"ఉట్టిగనే సూడనియ్యరు. పనిమీద పోవాలె."

476

"అరేయ్, మల్లేశా," అని పిలిశిండు నాయిన, ఆ కొనాకు నిలబడి వున్నడు. ఉరికిన.

"ఎక్కడికి పొయినవుర గాడిదీ ?"

"అక్కడ, విద్యానాదు" అంటుంటె.

"ఊఁ, ఊఁ, నడువు. అగో, తాత అక్కడ....అన్నడు నాయిన. విద్యానాదుగూడ వొచ్చిండు.

"ఏం చేస్తున్నవుర అక్కడ ?" అన్నడు నాయిన.

"కిందికి సూస్తున్నము" అన్నడు విద్యానాదు.

"అట్ల సూడొద్దురా. పడితె, చేస్తే కష్టం."

"ఇక్కడెందుకు పడుతరు చిన్నాయినా, పిచ్చోల్ల దవకాన్ల పడుతరు. అందికే అక్కడ జాలీలు పెడుతరు." అన్నడు విద్యానాదు.

తాత కండ్లు మూసుకొనున్నడు. మెడలదాక దుప్పటి కప్పిన్రు. ముక్కుల్ల నించి గొట్టాలు పెట్టిన్రు. ఇంకో గొట్టం పట్టి గట్టి, రెట్టకు పెట్టిన్రు.

"ఆ గొట్టాలు గాలివి. ఇది గ్లూకోసు." అన్నడు నాయిన అమ్మతోని.

అమ్మ ఏడ్చింది.

"దవకాన్ల అట్ల ఏడ్వొద్దు." అన్నడు నాయిన.

"నాయినా, ఇగో. గ్లూకోసు ఐపోతున్నది. ఇంకోటి తెమ్మని చెప్పాలె." అన్నడు విద్యానాదు పెద్దనాయినతోని.

"ఏంచేస్తంర విద్యా. ఇక్కడ ఎవరింటరు మనం చెపితె ? ఏదో, పెద్ద డాక్టరు కాళ్ళు పట్టుకుంటె, ఇంటికి బొయ్యి ఎంతో ముట్టచెపితె యిదన్న దొరికింది. నర్సులు అసలు యింటలేరు. ఆల్లకు గూడ కావాల్నట. ఏం చెయ్యాలె. అంత ఫీ అన్నట్టె, మల్ల అయ్యే పైసలు ఐతనేవుండె."

విద్యానాదు పొయ్యి నర్సునడిగిండు.

"ఇక్కడ స్టాక్ లేదుబాబూ. పొయ్యి హెడ్‌నర్సు నడుగు. లేకపోతె డాక్టరుకు రిపోర్టు చెయ్యి."

"ఇక్కడి డాక్టరెవరు ?"

"ఒస్తడు. అగు."

477

["ఎట్ల సిస్టర్, ఆ ఓల్డ్‌మాన్ క్రిటికల్‌గ వున్నడు."

"సోవ్హాట్, మాకిదొక్కటే కేసనుకుంటవా? వి సీ ఎ హండ్రెడ్ కేసెస్ లైక్ దిస్ ఎవ్వెరీ డే."]

నర్సు కోపంగా నడ్శి పొయ్యింది.

"ఏం చేద్దాం నాయినా, ఇంకెవ్వరికి చెప్పుతం?"

"దేవునికి."

అర్రైతున్నది.

"అఁ. ఇంక లేవుండ్రిరా. పోవాలె." అన్నడు పెద్దనాయిన. చెంద్రిక, రమేశు వార్డంత తిరుగొచ్చిండ్రు.

"నాయినా, అక్కడొక మనిశి కాలిపొయ్యిండట. పెయ్యినిండ కట్లు కట్టిన్రు." అన్నడు రమేశు.

"మీరు దవకాన కొచ్చింది గిందికేనారా? తాతను సూస్తమని వొస్తరు. ఇక్కడి కొచ్చేమొ వూరంత తిరిగొస్తరు."

"తాత మాట్లాడుతలేడుగద నాయిన."

"ఊఁ. ముక్కుల ట్యూబులుంటె ఎట్ల మాట్లాడుతడు?"

"ముక్కుల ట్యూబులుంటె మాట్లాడెతందుకేం?" అని రమేశు తన ముక్కుల్ల రెండు ఏల్లు కుక్కుకొని, 'వాఁ, వాఁ, వాఁ' అని సప్పుడు చేశిండు.

"అట్లగాదు. అవి లోపలిదాక వుంటె?"

"ఎమ్, లొల్లి చెయ్యకుండ్రి బద్మాశ్!" అన్నది పెద్దమ్మ.

జెర సేపటికి నర్సు తిరుక్కుంట వొచ్చి, "ఏమమ్మా, యింక యిక్కడున్న రేం? టైమైపోయింది." అన్నది.

పెద్దనాయిన రాత్రికి యిక్కన్నె పడుకుంటడు. పొయ్యే తొందర మాకే.

అమ్మ ఒక్కసారి మల్ల తాత పక్క దెగ్గెరికి పొయ్యి పిలిశింది. తాత మూలిగిండు. తాత అప్పటినించి మూలుగుతనే వుండు. కని అమ్మ తాత జవాబిచ్చిండనుకోని, ఇంకోసారి ఏడ్శి, కండ్లు తుడుసుకోని వచ్చింది.

దవాకాన గేటు దాటి యివుతలి కొచ్చినం. లోపల ఎంత సున్-సాన్ వుంటదో యివుతల అంత లొల్లి. మల్ల రిక్షలు మాట్లాడుకోని యింటి కొచ్చినం.

అన్నాలు దిన్నం. విద్యాసాగరు, రమేశు, చెంద్రిక పుస్తకాలు ముందలేసుకోని కూసున్నరు. అట్ల కూసోకపోతె వాల్లమ్మ కొట్టదట.

'నువ్వు పండుకుంటవా?' అని అడిగింది చెంద్రిక.

"లేదు." అన్న.

"పండుకో. పండుకో. మీ వూల్లె జెల్దిపండుకునే అల్వాటేమొ. పండుకో." అని పీటమీద జముకాన పరిశింది.

కాల్లు ముడుసుకొని, కండ్లు మూసుకోని, గోడ దిక్కు మొకం చేసి పండుకున్న.

అమ్మ, పెద్దమ్మ వొచ్చి పీటమీద కూసున్నరు.

"పండుకున్నావుర, వారీ." అన్నది పెద్దమ్మ.

నేను మాట్లాడలేదు.

పెద్దమ్మ చెప్పింది.

"గోస సూడలేక పోయినము చెల్లే. ముసలాయిన గోస యింతంతగాదు. ఈ వారం రోజులు యమలోక మనుబవించిండు. హయ్యో. ఎక్కడి దగ్గో, ఎక్కడి తెమ్డనో.... అమ్మమ్మమ్మ.... ఇంతగాదు. మీ బావ, నేను ఎంత యిదైనమని, ఎన్ని గురుగులు కొనుక్కొచ్చిన మనుకున్నవు.... ఎట్ల చెప్పినా నమ్ముతవు చెల్లే. ఒక్కొక్కసారి తెమ్డ వూమిస్తే గురిగి నిండిపొయ్యేది. అవుతల పారేస్తె సపాయోల్లు అడిగిరి. యింట్ల వుంచుకుందామంటె వొశము గాకపాయె. ఎక్కడి వాసన, ఎక్కడి వాసన. ముక్కులు పలిగిపొయ్యే వాసన. ఒగ అన్నం తినబుద్దైతదా, నీల్లు తాగబుద్దైతదా.... మొన్న మీ బావ ఆయినను దవకానకు తీసుకపొయినంక జెర యిల్లంత పినాయి లేశి కడిగిన...."

"ఊల్లె మాతాన వున్నప్పుడు గంతే అక్కా." అని అమ్మ మొదలుబెట్టింది. నాకు నిద్రొచ్చింది.

లైటేశింద్రు. పెద్దనాయిన మాటలు యినొచ్చినయి. కండ్లు తెరిశిన. లేశి కూసోని, "ఏమైందక్కా?" అని అడిగిన చెంద్రికను.

"తాత సచ్చిపొయ్యిండట."

నాయిన, పెద్దనాయిన అప్పుడే పొయ్యింద్రు.

తర్వాత, చెంద్రిక మెల్లెమెల్లెగ చెప్పింది.

మే మొచ్చినంక జెర సేపటికి కొత్త సిలిండరు తెచ్చింగ్రట. గ్లూకోసు సీసాలుగూడ మారు స్తమన్నరట. కాని తాత అప్పుడు తెలివికొచ్చి, 'అరేయి, ఇవి తీశెయ్యింగ్రిరా' అన్నడట. పెద్దనాయిన తాత రొండుచేతులు పట్టుకొని, ట్యూబులు తియ్యకుంట వున్నడట. కాని తాత కొట్లాడిండంట. పెద్దనాయినను తిట్టిండట. పెద్దనాయినకు బయమై నర్సును పిలిశిండట. నర్సు పలుకకపోతే, అక్కడికి పొయ్యిండట. ఒచ్చేటప్పటికే తాత ట్యూబులు పీకేసుకున్నడట. నర్సు సూశి, ఇంక యివన్నీ అక్కర్లేదు. అని గ్లూకోసుకూడ తీసేశిందట. తరువాత జెర సేపటికే తలకాయదెగ్గెర్నించి వొల్లంత సల్లబడ్డదట. ఇప్పుడేమో తాత పీనుగను తెస్తెందుకు పొయింగ్రట.

ఇంక పన్నెండుగూడ గాలేదు.

అప్పుడే యివుతల జాగ తయారుజేశింగ్రు. రమేశు యింక పండుకోమన్నడు. ఇంట్ల లైట్లన్ని ఏశింగ్రు. తాత కొట్లాడిండంటే గమ్మతుగున్నది. ఎట్ల కొట్లాడిండో? వీల్లు పొయ్యేటప్పటికే తాతను మార్చువరీకి తీస్కపొయింగ్రేమొ!

"బట్టలన్ని ముట్టుకోకుంగ్రిరా. మైలబడుతయి." అన్నది పెద్దమ్మ. ఇవుతల మూలకు కూసోని అట్లనే నిద్రబోయినగని లొల్లికి మేలుకొచ్చింది. ఇంటిముందల మోటరాగింది. అందరు పొయ్యి తాత పీనుగును యివతలికి తీసుకొచ్చిగ్రు. చెంద్రిక పొయ్యి లోపల్నించి సాప తెచ్చి పరిశింది. "దాని మీద ఒక పాత దుప్పటి పరుసే చెంద్రికా." అన్నది పెద్దమ్మ. చెంద్రిక ఏదో దుప్పటి తెచ్చింది.

"అది గాదే, పాడుదానా, ఉంకోదుప్పటి, కిందవున్నది సూడు." అన్నది పెద్దమ్మ.

చెంద్రిక యింకోటి దెచ్చింది, పెద్దమ్మ మల్ల ఏదో అనబొయ్యింది. గని "ఊఁ, ఊఁ! ఏదో పరువు," అన్నడు పెద్దనాయిన.

తాతను అక్కన్నే పండబెట్టిన్రు. మొకంమీదికెల్లి బట్ట తీశేశింగ్రు.

పెద్దనాయిన మల్ల టైం సూశిండు.

"ఇప్పట్నించి ఏంచేస్తరు, జెర సేపుకూసోండ్రి. నాలుగైదు గొట్టంగ పొయ్యి అందరికి జెప్పిరావాలె." అన్నది పెద్దమ్మ.

"అరేయి, మల్లేశా, రాత్రంతా మేలుకుంటవాయేం, పొయ్యి పండుకోపో." అన్నడు నాయిన.

తాతను ముట్టుకుంటె సల్లగున్నది. మొకము ఏదో చెక్కతోని చేశినట్టు గట్టిగ వున్నది. రాత్రంత తాతను సూసుకుంట, పెయ్యి ముట్టుకుంట కూసోవాల్ననుకున్న కని జెరసేపటికే నిద్రొచ్చింది. ఒద్దని ఎంతగట్టిగ అనుకున్నా నిద్ర అగలే. మేల్కొచ్చెటప్పటికి తెల్లారింది. మొకం కడుక్కొ నొచ్చిన.

తాతను యివుతలికి తెచ్చిన్రు. పెద్ద నాయిన పొయ్యి అందరికి చెప్పొచ్చి, మల్ల కాష్టానికి చెప్పేతందుకు పొయిండు. పెద్దమ్మ మాకు పైసలిచ్చి, హోటలుకు పొయ్యి ఏమన్న తిని రమ్మన్నది. విద్యానాదు మమ్ముల్ని ఇరానీ హోటలుకు తీస్కపొయిండు. అక్కడ సీన్మా రికార్డులు ఏస్తున్నరు. విద్యానాదు పేపరు సూశిండు. ఆదివారం శానా సీన్మాలున్నయి. నాకు తాతను ఏంచేస్తున్నరో సూడాలనిపిచ్చింది. అవు. ఇంక జెరసేపట్ల తాతను తీస్కపోతరు. ఈ జెరసేపన్న సూడొద్దా?

"అన్నా, పోదాం పా." అన్న.

"ఎహె, కూసోవారి. అక్కడంత లొల్లి-పాడు. మంచిగ పాటలిన రాదు." అన్నడు విద్యానాదు. విద్యానాదు కెందు కిష్టంలేదు? ఇప్పటికి శానా సావులు సూశిండేమొ!

"ఇయ్యాల నేను మాదోస్తులతోని గండిపేటకు పోవాలనుకుంటె యిదొచ్చిపడ్డది!"

"పాపం, ముసలోడు." అన్నది చెంద్రిక.

మంచిమంచి పాటలేస్తున్నరు. విద్యానాదు ఏపాట ఏసీన్మలదో చెపుతున్నడు. 'ఎహె, అండ్లదిగాదు. ఇండ్లది." అంటున్నది చెంద్రిక. వాల్లు కీసులాడుకుంటున్నరు.

ఆకరికి చెంద్రిక, 'అయ్యో శానసేపైంది. పోదాం పద. అమ్మ తిట్తది.' అంటె లేశి వొచ్చినం. అప్పటికె తాతకు స్నానం చెయ్యించిండ్రట. సచ్చిపొయినోనికి స్నాన మెట్ల చెయిస్తరో?.... బొట్లు పెట్టిండ్రు. కొత్త బట్టలు కట్టిచ్చి గోడకు కూసోబెట్టిన్రు. దూరంనించి సూస్తె తాత బతికున్నట్టే వున్నడు.

నాయిన గిట్ల మల్ల ఏడ్శిన్రు.

తాతను లేబట్టి పాడెమీద పెట్టిన్రు.

"జెల్ది కానియ్యన్రి. పొద్దుబాయె." అని తొందర జేస్తున్నరు.

అందరు ఏడుస్తనే వున్నరు.

"ఊఁ. జెల్ది. జెల్ది." అనుకుంట పాడె లేపిండ్రు. ఇంక నడుక. అందరు ఎవరి పనులమీద వాల్లు పోతుంటె, మేమేమొ తాతను తీస్కోని కాటికి.

అక్కడ మల్ల తొందర.

బాపనోడొచ్చిండు. మంత్రాలు సదివిండు. కాష్టం అప్పటికె పేర్శివున్నది. కాష్టంల పెట్టేముందు మల్ల ఏడుపు, అప్పుడైతె నాకు గూడ ఏడుపాగలేదు. విద్యానాదు గూడ కండ్లల్ల నీల్లు తెచ్చుకుండు—బాపనోడొక్కడే ఏడ్వలేదనుకుంట. తనపని తను దబదబ చేసుకుంట పోతున్నడు.

తాతను కాష్టంల పెట్టి మీద కట్టెలు పెట్టిన్రు. ఏడుపు. గ్యాసునూనె పోశిన్రు. నిప్పు ముట్టించిన్రు. జెరసేపు పంకా కొట్టిన్రు. మంటలంటుకున్నాయి. మల్ల తొందర. "ఆఁ. ఇంకేం సూస్తరు, పదుండ్రిరా. స్నానాలు చేశి పదుండ్రి." అది అదిగూడ సూడనియ్యకుంట స్నానాలు చేశిండ్రు.

మేం స్నానాలు చేశి వొచ్చేటప్పటికి మంటలెక్కువయినయి. ఒగసారి కాష్టానికి మొక్కి ఇంటికి నడిశినం.

రొండున్నర ఐంది. విద్యానాదు మ్యాట్నీకి పోదామన్నడు. "మూడింటికి రేడియోల సీన్మా వొస్తదట. ఇనొచ్చులే." అన్నది చెంద్రిక.

ప్రజల పత్రిక

ప్రభంజనం

(రాజకీయ పక్ష పత్రిక)

విడిప్రతి : 25 పైసలు సం॥ చందా 6 రూ.

ఎడిటర్, ప్రభంజనం, ప్రొద్దుటూరు, కడప జిల్లా.

482